ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
బుధవారం 17 ఏప్రిల్ 2024





ఓ చెంచు కుటుంబం గుడిసె

పునరావాసానికే మొగ్గు

- అడవిని విడిచేందుకు ముందుకొస్తున్న చెంచులు
- అంతరిస్తున్న ఉత్పత్తులు, పులుల భయమే కారణం
- అక్కడే ఉంటే మెరుగైన విద్య, వైద్యం అందదనే భావన
- ఎన్‌టీసీఏ పథకంలో భాగంగా ప్యాకేజీలు అందిస్తున్న ప్రభుత్వం
- పలు చెంచుపెంటల నుంచి 90 శాతం మంది అంగీకారం



పునరావాసంలో భాగంగా తరలించనున్న సార్లపల్లి గ్రామం

దోమలపెంట, ఏప్రిల్ 16: నల్లమల అటవీ ప్రాంతంలో ఫలాలు, ఉత్పత్తులు రోజు రోజుకు తగ్గిపోతుండటంతో వాటిని సేకరించి, జీవనం సాగించే లోతట్టు ప్రాంత చెంచులు, చెంచేతరులకు పూట గడవటం ప్రశ్నార్థకంగా మారింది. దీనికితోడు వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచంతలబావి, తాటిగుండాల, కొల్లంపెంట, కొమ్మనపెంట చెంచుపెంటలు దట్టమైన అమ్రాబాద్ అభయారణ్యం ప్రాంతంలో ఉన్నాయి. ఈ ప్రాంతంలో గతంలో అటవీ జంతువులు తక్కువగా ఉండటంతో ఆరు దశాబ్దాల పాటు వ్యవసాయం చేసేందుకు కొంత అనుకూలంగా ఉండేది. రానురాను అడవుల అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించడంతో నల్లమలలో పులులు, చిరుత పులులు, ఎలుగుబంట్లు, దుప్పులు, జింకలు, అడవి పందులు, కోతులు గణనీయంగా పెరిగాయి. దాంతో అటవీ ప్రాంతంలో భూమిలో విత్తనం వేసిన నాటి నుంచి పంట ఇంటికి చేరే వరకు అటవీ జంతువుల నుంచి కాపాడుకునేందుకు రైతులకు కత్తిమీద సాములా మారింది. ఒక్క పూట కాపలా లేకపోతే కష్టం బూడిదలో పోసిన పన్నీరవుతుందన్న ఆందోళన నెలకొంది. మరోవైపు ఇక్కడ వర్షాధారంగానే వ్యవసాయం చేస్తుండటంతో నీరు, కరెంటు సౌకర్యం లేక సాగుకు మొగ్గు చూపడం లేదు. దాంతో అడవిని విడిచి అటవీ శాఖ ఎన్‌టీసీఏ పథకంలో భాగంగా కల్పిస్తున్న పునరావాసం పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే వటువర్లపల్లి, సార్లపల్లి గ్రామాల 20 శాతం మంది ప్రజలు మాత్రం.. తమ తాత ముత్తాతల కాలం నుంచి ఇక్కడే బతుకుతున్నామని, ఉన్న ఊరును విడిచి వెళ్లాలంటే కన్న తల్లికి దూరయినట్లు బాధేస్తుందని అంటున్నారు. తమకు పునరావాసం వద్దని, చావయినా.. బతుకయినా ఇక్కడే ఉంటామని చెబుతున్నారు.



నల్లమల అభయారణ్యం

భయం గుప్పిట్లో..

వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబావి, తాటిగుండాల, కొల్లం, కొమ్మెనపెంట గ్రామాల్లోకి పెద్ద పులులు, చిరుత పులులు చొరబడి నిత్యం పశువులు, మేకలను చంపి తింటున్నాయి. మేత కోసం అడవికి వెళ్లిన పశువులు, జీవాలు ఇంటికి తిరిగి వస్తాయన్న నమ్మకం రోజు రోజు సన్నగిల్లుతోంది. పులుల వల్ల చనిపోతున్న పశువులకు అటవీశాఖ నామమాత్రంగా పరిహారం ఇస్తోంది. అటవీ జంతువుల వల్ల పంటలు దెబ్బతిన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మరోవైపు అటవీ శాఖ అధికారుల ఒత్తిళ్లు కూడా అధికమవడంతో ఇక్కడ జీవించాలంటే చెంచుల్లో అభద్రతా భావం ఏర్పడింది.



బయటి ప్రపంచంతో పోటీ పడలేమని..

డిగ్రీలు, పీజీలు, ఇంజనీరింగ్‌లు చదివినా.. ఉన్న ఊరిలో ఉపాధి అవకాశాలు లేక చాలా వంది యువకులు.. నిరుద్యోగులు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్తున్నారు. మారుమూల ప్రాంతంలో ఉంటే తమ పిల్లలకు మంచి విద్య, వైద్యం ఇవ్వలేమని, ఇక్కడే ఉంటే తమ పిల్లలూ కూలీలుగానే బతకాలని, బయటి ప్రపంచంతో పోటీ పడలేరని చెంచులు భావిస్తున్నారు. అందుకే అటవీ ప్రాంతం నుంచి బయటికి వచ్చేందుకు 90 శాతం మంది సిమయ్యారు.

పునరావాసం కోసం స్వచ్ఛందంగా ముందుకు..

అడవిలో జీవనం రోజు రోజుకు గగనంగా మారడంతో అటవీ శాఖ కల్పిస్తున్న పునరావాసం పొందేందుకు చెంచులు ముందుకొస్తున్నారు. అమ్రాబాద్ అభయారణ్యంలోని సార్లపల్లి చెంచులు స్వచ్ఛందంగా ముందుకు రావడంతో ఎన్‌టీసీఏ పథకం(నేషనల్ టైగర్ కన్జర్వేషన్ ఆఫ్ అథారిటీ)లో భాగంగా పెద్దకొత్తపల్లి మండలం బాచారంలో వీరికి పునరావాసం కల్పించేందుకు అటవీ శాఖ నిర్ణయించింది. సార్లపల్లిలో అన్ని కులాలు కలిపి 164 ఉమ్మడి కుటుంబాలు ఉన్నాయి. ఇందులో చెంచు కుటుంబాలు 70, చెంచేతర కుటుంబాలు 94 కుటుంబాలు ఉన్నాయి. ఎన్‌టీసీఏ పథకం నిబంధనల ప్రకారం 18 ఏళ్ల పైబడిన యువతీ యువకులను ఒక కుటుంబం కింద పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో పథకంలో లబ్ధిపొందేందుకు సార్లపల్లి నుంచి దరఖాస్తు చేసుకున్న వారిలో 186 కుటుంబాలను అర్హులుగా గుర్తించారు. అందులో చెంచు కుటుంబాలు ఐదు, ఎస్సీ 29, బీసీ 142, ఓసీ కుటుంబాలు 10 ఉన్నాయి. వారిలో 85 మంది రూ.15 లక్షల నగదు ప్యాకేజీ, 101 మంది అన్ని మౌలిక వసతులతో తూడిన ఇంటి నిర్మాణం, ఐదు ఎకరాల వ్యవసాయ భూమి తీసుకునేందుకు సమ్మతించారు. సార్లపల్లికి చెందిన పలు చెంచు కుటుంబాలు అటవీశాఖ ఆధ్వర్యంలో ఇటీవల బాచారం గ్రామాన్ని సందర్శించాయి. అక్కడి భూములు, పరిస్థితులను పరిశీలించిన తరువాత మరో 15 చెంచు కుటుంబాలు పునరావాసం కోసం దరఖాస్తు చేసుకున్నాయి.

కుడిచంతలబావిలో..

కుడిచంతలబావిలో అన్ని వర్గాల వారివి 105 ఉమ్మడి కుటుంబాలు ఉన్నాయి. 166 మందిని పునరావాసం ప్యాకేజీలో అర్హులుగా గుర్తించారు. అందులో చెంచు కుటుంబాలు 28, లంబాడ గిరిజన తొమ్మిది, ఎస్సీ 3, బీసీ 97 కుటుంబాలు ఉన్నాయి. రూ.15 లక్షల నగదు ప్యాకేజీ తీసుకునేందకు 72 మంది, వ్యవసాయ భూమి, ఇండ్లు పొందేందుకు 94 మంది ముందుకు వచ్చారు. తాటిగుండాల చెంచు పెంటలో మొత్తం 24 చెంచు కుటుంబాలు ఉన్నాయి. వీరంతా పునరావాసంలో భాగంగా భూమి తీసుకునేందుకు ముందుకొచ్చారు. కుడిచింతలబావి, తాటిగుండాల గ్రామాల్లో 100 శాతం ఊరును ఖాళీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. దాంతో ఆ గ్రామాలకు పునరావాసం కల్పించే విషయమై కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ వేసేందుకు అటవీశాఖ కసరత్తు చేస్తోంది.

వటువర్లపల్లిలో..

వటువర్లపల్లిలో 600 మందికిపైగా పునరావాసం కోసం దరఖాస్తు చేసుకున్నారు. 515 కుంటుంబాలకు గత సవత్సరంలో సోషల్ ఎకనామికల్ సర్వే చేశారు. ఇక్కడ 90 శాతం మంది ఎన్‌టీసీఏ పథకంలో పునరావాసం పొందేందుకు అనుకూలంగా ఉన్నారు. ఆ కుటుంబాలకు సంబంధించి త్వరలోనే ఆర్‌అండ్‌బీ సర్వే చేపటేందుకు అటవీ శాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. వటువర్లపల్లి, సార్లపల్లిలో కొందరు గిజనులు, గిజనేతరులు పునరావాస ప్యాకేజీ అమలుపై అనుమాలు వ్యక్తం చేస్తున్నారు. ముందుగా పునరావాసం పొందేవారికి కల్పించే వసతులను గమనించి, ఆ తర్వాత మిగతా వారు అడుగు వేసే ఆలోచనలో ఉన్నారు.

ఎవరినీ బలవంతంగా తరలించడం లేదు



ఎన్‌టీసీఏ పథకంలో పునరావాసం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అన్ని రకాల వసతులతో తిరుపతి-హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కన పెద్దకొత్తపల్లి మండలం బాచారంలో కాలనీ నిర్మిస్తున్నాం. వారికి ఐదు ఎకరాల వ్యవసాయ భూమి రెవెన్యూ భూమిగా బదలాయించి ఇస్తాం. అందులో ఎటువంటి సందేహం లేదు. అటవీశాఖ తరఫున ఎవరినీ బలవంతంగా తరలించడం లేదు. ఇష్టపడి వచ్చే వారినే పంపిస్తాం. అటవీ జంతువులకు ఇబ్బంది కలిగించి, అడవులను ధ్వంసం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- రోహిత్ గోపిడి, డీఎఫ్‌వో, అచ్చంపేట

పునరావాసం పొందేందుకు సిద్ధంగా ఉన్నాం



మా తాతలు, తండ్రులు, మేము అడవిలో ఉండటంతో మాకు సరైన చదువు లేదు. ఏదైన ఆపని వస్తే 50 కిలో మీటర్ల దూరంలో ఉన్న అచ్చంపేటకు పోవాలి. తాగేందుకు మంచి నీళ్లు కూడా లేవు. చిలుము నీళ్లు తాగడంతో చాలా మంది చెంచుల కడుపుల్లో గడ్డలు అయ్యి ఎందరో చనిపోయారు. చదువు లేక చిన్నతనంలో పెండ్లిల్లు, కాన్పులు కావడం, తాగుడుకు అలవాటు పడటంతో తమ జాతి అంతరించి పోతోంది. మేము పునరావాసం పొందేందుకు సిద్ధంగా ఉన్నాం. మా చెంచులు కొందరు పట్టణాల్లో ఉంటూ తప్పుడు మాటలు చెప్పి, నాలాంటి వారిని అడవుల నుంచి బయటకు రాకుండా చేస్తున్నరు.

- మండ్లి భౌరమ్మ, మాజీ సర్పంచ్, కుడిచింతలబావి

మైదాన ప్రాంతంలో మేం బతుకలేం



మా చెంచు గిరిజనులు అడవులను వదిలి మైదాన ప్రాంతంలో బతుకలేరు. మా జాతి వారికి వ్యవసాయం చేయడం రాదు. పునరావాస ప్యాకేజీలో బాచారం తీసుకపోతే అక్కడ ఎటువంటి అటవీ ఉత్పత్తులు దొరుకవు. జీవనోపాధి కష్టంగా ఉంటుంది. ఇష్టపడి పోయేవారికి మేము వ్యతిరేకం కాము. కానీ బలవంతంగా తరలించాలని ఒత్తిడి చేస్తున్నట్లు మా సంఘానికి ఫిర్యాదు చేస్తే.. కలెక్టర్, డీఎఫ్‌వోలపైనా కేసులు పెట్టేందుకు కూడా వెనుకాడం.

- చిగుర్ల మల్లికార్జున్, తెలంగాణ ఆదివాసి ఐక్య వేదిక కన్వీనర్(సార్లపల్లి)

శ్రీరాముడు సేద తీరిన రామకొండ

- కొండపై స్వయంభువుగా రామపాదం
- ఆదివారం అమావాస్య రోజు స్వామికి ప్రత్యేక పూజలు
- నేడు సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు


కోయిలకొండ, ఏప్రిల్ 16: త్రేతాయుగంలో శ్రీరాముడకి సేద నిచ్చిన స్థలంగా మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండలోని శ్రీరామకొండ ప్రసిద్ధి గాంచింది. శ్రీరాముడు లక్ష్మణుడితో కలిసి రామకొండలోని ప్రసుత్తం ఉన్న గర్భాలయం బండపై కొంత సేపు సేద తీరారని, దీంతో అక్కడ శ్రీరాముని కుడి పాదం స్వయం భువుగా వెలిసిందని ప్రచారంలో ఉంది. కొండపై ఉన్న కోనేర్లు, ప్రకృతి అందాలను చూసి రాములవారు తన్మయం చెందారని పూర్వీకులు చెబుతున్నారు. శ్రీరాముడు వచ్చిన విషయాన్ని రుషులు తెలుసుకుని, ఈ కొండపై స్థావరాలు ఏర్పాటు చేసుకొని పూజలు చేశారని తెలుస్తోంది. నేటికి ఇక్కడ మునుల స్థావరాలు కనిపిస్తాయి. ఈ కొండపై సంజీవని చెట్టుతో పాటు పలు ఆయుర్వేద మూళికలు ఉన్నాయని గ్రామ పెద్దలు చెబుతున్నారు. ఆదివారం అమావాస్య రోజు ఇక్కడికి భక్తులు వేలాదిగా తరలొచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఇక్కడి కోనేటి నీటిని, కొండపై ఉండే చెట్ల కొమ్మలను ఇళ్లను తీసుకెళ్తారు.



కొండపై సీతారాముల విగ్రహాలు



కొండపై వెలిసిన రామపాదం



రామకొండపై వెలిసిన ఆలయం

ఏర్పాట్లు పూర్తి

శ్రీరామనవమి సందర్భంగా బుధవారం రామకొండపై సీతారాముల కల్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. నవమికి ముందు రోజు సీతారాముల ఉత్సవ విగ్రహాలకు కోయిలకొండలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం పల్లకీలో స్వామి, అమ్మవార్లను కొండపైకి ఊరేగింపుగా తెస్తారు. ఈ సందర్భంగా వర పూజ, ఎదురుకోళ్ల నిర్వహిస్తారు. నవమి రోజు భద్రాచలంలో మాదిరిగా అభిజిత్ లగ్నంలో స్వామి, అమ్మవారికి కల్యాణం చేస్తారు.

రేపటి నుంచి లోక్ సభ ఎన్నికల..
నామినేషన్ల స్వీకరణ

- జిల్లా ఎన్నికల అధికారి రవినాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి రవినాయక్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఏప్రిల్ 16: లోక్ సభ ఎన్నికల నామినేషన్లను ఈ నెల 18 నుంచి 25 వరకు స్వీకరించ నున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి.రవినాయక్ తెలిపారు. మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21న ఆదివారం మినహాయించి మిగత ఏడు రోజులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు కలెక్టర్ చాంబర్‌లో రిటర్నింగ్ అధికారి నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థికి సంబంధించి మూడు వాహనాలు మాత్రమే అనుమతిస్తారని, మిగతా వాహనాలు వంద మీటర్ల దూరంలో ఉండాలని సూచించారు. రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో ఐదుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఒక ప్రతిపాదకుడు, గుర్తింపు పొందని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు 10 మంది ప్రతిపాదకులు ఉండాలని చెప్పారు. ప్రతిపాదకులు పార్లమెంట్ నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ఈ నెల 26న అదే చాంబర్‌లో స్ర్కూటనీ, 29 వరకు ఉపసంహరణకు గడువు ఉంటుందని తెలిపారు. కలెక్టరేట్‌లో సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసి, నామినేషన్ పత్రం ప్రింట్, అఫిడవిట్ పత్రాలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అన్ని రకాల అనుమతుల కోసం సువిధ సింగిల్ విండో ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా పాటించాలన్నారు. ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా, కేబుల్ చానళ్లలో రాజకీయ ప్రకటనల జారీకి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 85 ఏళ్ల పైబడిన వృద్ధులకు, పోలింగ్ కేంద్రాకు వెళ్లలేని దివ్యాంగులకు హోమ్ ఓటింగ్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, డీఆర్‌వో కేవీవీ రవికుమార్, బీజేపీ నుంచి ఏ.అంజయ్య, పి.రాజేందర్‌రెడ్డి, సీపీఐ(ఎం) నుంచి బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పథకాలతో ప్రజలకు మేలు

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మన్నె శ్రీనివాస్‌రెడ్డి

చిన్నచింతకుంట, ఏప్రిల్ 16: మాజీ సీఎం కేసీఆర్ హయాంలో అమలు చేసిన పథకాలు పేదలు, బడుగు, బలహీన వర్గాల వారికి ఎంతగానో మేలు చేకూర్చాయని బీఆర్‌ఎస్ మహబూబ్‌నగర్ పార్లమెంటు అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి చిన్నచింతకుంట మండల కేంద్రంలోని ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ మనసున్న నాయకుడన్నారు. ఆయన దేశంలోనే తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తెచ్చారన్నారు. తెలంగాణ అభివృద్ధి ఆయనకే సాధ్యమైందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త ఎంతో కృషి చేయాలన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. ఎంపీ ఎన్నికలతో పాటుగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పదవి ఉన్నా లేకున్నా మీకు అండగా అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో నారాయణపేట, మక్తల్, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, చిట్టెం రాంమోహన్‌రెడ్డి, అంజయ్య యాదవ్, అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు పట్టెం రాజేశ్వరి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోట రాము, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించుదాం

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 16: దేశాన్ని, ఆర్థిక వనరులను కుబేరులకు తాకట్టు పెట్టి పాలిస్తున్న దోపిడీ దొంగల బీజేపీ పాలనను గద్దెదించి.. దేశ ప్రజల సంక్షేమం కోసం పనిచేసే కాంగ్రెస్‌ను అధికారంలోకి తెద్దామని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లోని క్రౌన్ ఫంక్షన్ హాల్‌లో స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌తో కలిసి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చి, రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇదివరకు పాలమూరులో బీఆర్‌ఎస్ రాక్షసపాలన సాగిందన్నారు. మళ్లీ బీజేపీ రూపంలో రాబోతోందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్ లోపాయికారి ఒప్పందంతో కలిసి పని చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ గెలుపునకు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు వినోద్‌కుమార్, సంజీవ్ ముదిరాజ్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ఓబీసీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, నాయకులు వసంత, ఎన్‌పీ వెంకటేశ్, ఎం సురేందర్‌రెడ్డి, ఏపీ మిథున్‌రెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, సీజే బెనహర్, సాయిబాబ, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, ఫయాజ్, అవేజ్, రాములుయాదవ్, అజ్మత్‌అలీ పాల్గొన్నారు.

భానుడి భగభగ

- గండీడ్‌లో 43.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్ టౌన్/ గద్వాల/ వనపర్తి అర్బన్, ఏప్రిల్ 16: భానుడు భగభగమని మండుతున్నాడు. ఎండలు మండుతుండటంతో జనం అల్లాడిపోతున్నారు. జిల్లాలో మంగళవారం 43.2 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదవడంతో వడగాలులు వీస్తున్నాయి. జనం ఇళ్ల నుంచి అడుగుబయట పెట్టాలంటేనే భయపడాల్సి వస్తోంది. ఉదయం 8 గంటల నుంచే ఎండప్రభావం కనిపిస్తోంది. సాయంత్రం ఆరు గంటలైనా ఎండ సెగ తగ్గడం లేదు. ఎండలు ఎక్కువగా ఉండటంతో జనం ప్రత్యామ్నాయాలు వెతుక్కుంటున్నారు. ఫ్యాన్లు వేసుకున్నా వేడిగాలి వస్తుండటంతో కూలర్లు, ఏసీలను ఆశ్రయిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్‌లో అత్యధికంగా 43.2 డిగ్రీలు నమోదవగా, బాలానగర్‌లో 42.7, అడ్డాకుల, సీసీకుంటలలో 41.9, మహ్మదాబాద్‌లో 41.8, మిడ్జిల్‌లో 41.6, దేవరకద్ర, జడ్చర్లలో 41.5 డిగ్రీలు నమోదు కాగా, మహబూబ్‌నగర్‌లో 41.3, నవాబ్‌పేట మండలంలో 39.8 డిగ్రీలు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వనపర్తి జిల్లా కొత్తకోటలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గోపాల్‌పేట, పాన్‌గల్‌లలో 41.8, వనపర్తి 41.6, చిన్నంబావి 41.5, పెబ్బేరు 41.4, పెద్దమందడి, శ్రీరంగాపూర్ 41.1, ఆత్మకూరు 40.8, అమరచింత 40.5, ఘణపూర్ 40.0, వీపన గండ్ల, మదనాపూర్ 39.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో 42.3, బిజినేపల్లిలో 42.2, అచ్చంపేటలో 41.0, కొల్లాపూర్‌లో 40.8, నాగర్‌కర్నూల్‌లో 40.2, కల్వకుర్తిలో 39.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో 41.3, గద్వాల, ధరూర్‌లలో 41, ఇటిక్యాలలో 40.9, కేటీదొడ్డి, వడ్డేపల్లిలలో 41.6, ఉండవెల్లి, అయిజలో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. నారాయణపేట జిల్లా కృష్ణలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మక్తల్‌లో 40, కోస్గి మండలంలో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

చెరువులో పడి వ్యక్తి గల్లంతు

వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 16 : ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి గల్లంతైన సంఘటన మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రాయిగడ్డ కాలనీకి చెందిన బొలె మోని రాములు(42) నల్ల చెరువులో ప్రమాదవశాత్తు పడి గల్లంతయ్యాడు. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి మృతదేహం కోసం గాలిస్తున్నారు.

ఇంట్లో చోరీ

పెబ్బేరు, ఏప్రిల్ 16 : వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో సోమవారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్ట ణంలోని జడ్పీహెచ్ఎస్ పక్కన ఉన్న రాజశేఖర్ అనే వ్యక్తి ఆదివారం పెళ్లి కోసమని ఇంటికి తాళం వేసి వేరే ఊరుకు వెళ్లాడు. మంగళవారం ఇంటికి వచ్చి చూడగా బీరువాలో దాచి ఉంచిన రూ.25 వేల నగదును గుర్తు తెలి యని వ్యక్తులు దోచుకెళ్లారని తెలిపాడు. ఎన్నికల కోడ్ ఉన్నందున నగదు తీసుకెళ్లొద్దనే ఉద్దేశంతో ఇంట్లో డబ్బులు పెట్టి వెళ్లామని బాధితుడు వాపో యాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీకి యత్నం


చోరీకి యత్నిస్తున్న దొంగ

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 16 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అర్ధరాత్రి ఓ దొంగ సెల్‌ఫోన్ దుకాణంలో చోరీకి విఫల యత్నం చేశాడు. సోమవారం రాత్రి ముఖానికి మంకీక్యాప్, చేతులకు గ్లౌజ్‌లు వేసుకుని సుత్తెతో తెలంగాణ చౌరస్తాలో ఉన్న ఓ సెల్‌ఫోన్ దుకాణం తాళం పగలకొట్టాడు. తాళం పగిలినా సెంట్రల్ లాక్ విధానం ఉండటంతో షట్టర్ ఓపెన్ కాలేదు. దొంగ చేసిన ఈ ప్రయత్న దృశ్యాలు సీసీ ఫుటేజీలో రికార్డ్ అయ్యాయి. మంగళవారం షట్టర్ తాళాలు పగిలి ఉండటాన్ని గమనించిన దుకాణం యజమాని సీసీ ఫుటేజీని పరిశీలించారు. అనంతరం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ


బలీద్‌పల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ

అడ్డాకుల, ఏప్రిల్ 16 : మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల పోలీస్‌స్టేషన్‌లో అంబేడ్కర్ జయంతి రోజు నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుపై మంగళవారం డీఎస్పీ వెంకటేశ్వర్లు మండలంలోని బలీద్‌పల్లి గ్రామంలో స్థానికులు, సాక్షులతో విచా రణ జరిపారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభంలో తలెత్తిన గొడవలో బలీద్‌పల్లి ఎంపీటీసీ సభ్యుడు గణేశ్‌ను కులం పేరుతో దూషించారని రాంరెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదైంది. కేసును విచారణలో భాగంగా డీఎస్పీ గ్రామస్థులతో మాట్లాడి, వివరాలు సేకరిం చారు. డీఎస్పీ వెంట అడ్డాకుల ఎస్సై శ్రీనివాస్, రైటర్ శంకర్‌నాయక్, రాజు ఉన్నారు.

నగదు పట్టివేత

కృష్ణ/బాలానగర్, ఏప్రిల్ 16 : నారాయణపేట జిల్లా కృష్ణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణ బ్రిడ్జి చెక్‌పోస్టు వద్ద మంగళవారం కేంద్ర సాయుధ బలగాలు వాహనాల తనిఖీ నిర్వహించాయి. మధ్యాహ్న సమయంలో కర్ణాటక నుంచి ఉ ట్కూరుకు వస్తున్న కురువ అంజప్ప అనే వ్యక్తి వాహనంలో రూ.86,400 నగ దును పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న నగదుకు సంబంధించి ఎలాంటి రశీదు లేకపోవడంతో వాటిని గ్రీవెన్స్ కమిటీకి పంపించినట్లు ఎస్సై ఎండీ.నవీద్ తెలిపారు. అదేవిధంగా, కర్ణాటక రాష్ట్రం యాదగిరి నుంచి వస్తున్న కారును తని ఖీ చేయగా నబీచాంద్ అనే వ్యక్తి వద్దనున్న రూ.70 వేలను పట్టుకున్నట్లు ఎస్సై వివరించారు. అదేవిధంగా, మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ పోలీసులు జా తీయ రహదారిపై మంగళవారం వివిధ వాహనాలను తనిఖీ చేశారు. ఓ కారు ను తనిఖీ చేస్తుండగా ఏపీలోని కర్నూల్ జిల్లా దేవకొండ మండలం బేతపల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య వద్ద రూ.59 వేలు పట్టుబడినట్లు ఎస్సై తిరుపాజీ తెలిపారు. నగదును ఉన్నతాధికారులకు అప్పగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

40 కిలోల సీహెచ్ స్వాధీనం

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 16 : జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కొండపేట గ్రామంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి 40 కిలోల సీహెచ్ పట్టుకున్నట్లు అలంపూర్ ఎక్సైజ్ సీఐ హనుమాన్‌నాయక్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ మహబూబ్‌నగర్ సీఐ బాలకృష్ణారెడ్డి, ఎస్సై నాగరాజుగౌడు, ఇతర అధికారులతో కలిసి సోమవారం రాత్రి కొండపేట గ్రామంలోని కల్లు దుకాణంపై దాడులు నిర్వహించారు. తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 40 కిలోల క్లోరోహైడ్రైడ్(సీహెచ్) లభ్యమైంది. విక్రయానికి ఉంచిన 234 లీటర్ల కల్లును పారబోశారు. గ్రామానికి చెందిన శాంతివెంకటేష్‌గౌడు, శాంతి రజనీబాబు గౌడులను అదుపులోకి తీసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి, మంగళవారం తహసీల్దార్ ముందు ప్రవేశపెట్టారు.

ఏడు లీటర్ల సారా పట్టివేత

గద్వాల క్రైం, ఏప్రిల్ 16 : జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం మూకుమ్మడిగా దాడులు నిర్వహించి, సారాను స్వాధీనం చేసుకున్నారని, బెల్లం పానకాన్ని పారబోశారని ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో, కేటీదొడ్డి మండల పరిధిలోని వాగుతండా, పూజారి తండా, తూర్పు తండాల్లో దాడులు నిర్వహించి, ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా బట్టీని ధ్వంసం చేసి, 300 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. అలాగే కర్ణాటక రాష్ట్రంలోని సింగిడి తండాలో దాడులు నిర్వహించి, రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 200 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. ఒకరిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో గద్వాల స్టేషన్ సీఐ గణపతిరెడ్డి, టాస్క్‌ఫోర్స్ సీఐ సైదిరెడ్డి, కర్ణాటక ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లాపూర్ మునిసిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం


అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చేతులు ఎత్తిన ఎక్స్‌అఫీషియో సభ్యుడు కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మునిసిపల్ కౌన్సిలర్లు

కొల్లాపూర్, ఏప్రిల్ 16 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మునిసిపల్ చైర్మన్ రఘుప్రోలు విజయలక్ష్మీపై కాంగ్రెస్ కౌన్సిలర్లు మంగళవారం ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. గత 21వ తేదీన ఇచ్చిన నోటీసు మేరకు జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశానుసారం కొల్లాపూర్ పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించిన అవిశ్వాస తీర్మానం ప్రిసైడింగ్ అధికారి, నాగర్‌కర్నూల్ డివిజన్ ఆర్డీవో ఎస్‌శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించారు. మునిసిపాలిటీలో మొత్తం 20 మంది కౌన్సిలర్లు, ముగ్గురు ఎక్స్‌అఫీషియో సభ్యులు ఉండగా అవిశ్వాస తీర్మానానికి అవసరమైన 15 మందికి గాను సమావేశానికి ఎక్స్‌అఫీషియో సభ్యుడు ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డితో కలిసి మొత్తం 16 మంది హాజరయ్యారు. చైర్మన్ రఘుప్రోలు విజయలక్ష్మీపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి సమ్మతి తెలుపుతూ చేతులు ఎత్తడంతో తీర్మానం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి వెల్లడించారు. అవిశ్వాస ప్రక్రియ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 2, 4, 15, 17, 20 వార్డుల కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. మరో వారంలోపు కాంగ్రెస్‌కు చెందిన కొత్త చైర్మన్ ఎన్నిక జరగనుంది.

సలేశ్వరం జాతరకు అనుమతి

- ఏడాదిలో తొమ్మిది మాసాలు అనుమతికి చర్యలు
- ఈనెల 22 నుంచి 24 వరకు మూడు రోజులు మాత్రమే అనుమతి
- డీఎఫ్‌వో రోహిత్‌గోపిడి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో రోహిత్ గోపిడి

మన్ననూర్, ఏప్రిల్ 16 : నల్లమల అభయారణ్య ప్రాంతంలో వెలసిన సలేశ్వర క్షేత్ర సందర్శనకు ఏడాదిలో తొమ్మిది మాసాలు సఫారీ పర్యటన ద్వారా రోజుకు వంద మందిని తీసుకెళ్లేందుకు అటవీ శాఖ ద్వారా ఏర్పాట్లు చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తున్నామని, ఈ విషయమై స్థానిక చెంచులతో కలెక్టర్ ఉదయ్‌కుమార్ సమక్షంలో చర్చించామని డీఎఫ్‌వో, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో రోహిత్‌గోపిడి తెలిపారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఈనెల 22 నుంచి 24 వరకు మూడు రోజులు సలేశ్వరం జాతర నిర్వహించేందుకు అటవీశాఖ అనుమతులిచ్చిందన్నారు. ప్లాసిక్‌ను సాధ్యమైనంత తక్కువగా వాడేలా భక్తులకు సూచనలిస్తున్నామని, అటవీశాఖ ద్వారా మన్ననూరులో చెంచు మహిళల చేత పర్యావరణహితమైన మార్వటాకులతో తయారు చేసిన విస్తరాకులను జాతరలో వాడేందుకు సిద్ధం చేశామన్నారు. అన్నదాన కేంద్రాలు నిర్వహించే దాతలు ఈ యేడాది విస్తరాకుల్లోనే భక్తులకు భోజనం పెట్టాలని ఆదేశించామని చెప్పారు. దేశంలోనే రెండో అతిపెద్ద అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో వెలసిన సలేశ్వర లింగమయ్య క్షేత్రానికి ఎంతో విశిష్టత ఉందని, గతంలో చెంచులతో పాటు స్థానికులే ఆరాధ్య దైవంగా కొలిచేవారని, వన్యప్రాణులకు, అడవికి ఎలాంటి నష్టం జరుగకుండా కాలినడకన మాత్రమే వెళ్లి చైత్రపౌర్ణమి రోజున లింగమయ్య దర్శించుకునేవారన్నారు. రానురాను ఈ జాతర పదులు వందలతో మొదలై లక్షలాదిగా భక్తుల రద్దీ పెరుగుతూ ఉండడంతో వన్యప్రాణులకు, అడవికి అపారమైన నష్టం జరుగుతోందన్నారు. అలాగే చైత్రపౌర్ణమి రోజున ఒకేసారి వేలాదిగా భక్తులు తరలివచ్చి తొక్కిసలాటలు జరుగుతూ ప్రాణనష్టం కూడా జరుగడం తీవ్ర విషాదాన్ని నింపుతోందని అన్నారు. రద్దీ కారణంగా చాలా మంది భక్తులు లింగమయ్య దర్శనం చేసుకోవడం లేదని అన్నారు. ఓవైపు భక్తుల మనోభావాల్ని గౌరవిస్తూ అటవీ నిబంధనల మేరకు మూడు రోజులు మాత్రమే అనుమతిస్తున్నామని అన్నారు. మిగతా రోజుల్లో సలేశ్వరం చూడలేమనే వారి కోసం అటవీ శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోందన్నారు. వచ్చే మే నుంచి ఏడాదిలో తొమ్మిది మాసాలు రోజుకు వంద మంది భక్తులను జంగల్ బుక్ సఫారీ వాహనాల్లో సలేశ్వరం తీసుకెళ్లి దర్శనం అనంతరం క్షేమంగా తిరిగి వచ్చేలా త్వరలోనే ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. స్థానిక రాంపూర్ పెంటలో చెంచులే భక్తులకు టిఫిన్, భోజనాలు తయారుచేసి పెట్టడం, చెంచు యువకులే సఫారీ వాహనాలు నడుపుకోవడం, గైడ్‌లుగా పనిచేయడం వంటి ఉపాధి అవకాశాలను శాశ్వతంగా కల్పించనున్నామని పేర్కొన్నారు. పర్యాటకుల ద్వారా ప్యాకేజీలో చెల్లించిన డబ్బులను వేతనాలు చెల్లించేందుకు ఉపయోగించుకుంటామని తెలిపారు. స్థానికంగా ఉండే చెంచులకు ఉపాధి దొరికితే అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం మంటలు పెట్టే చర్యలకు ఫుల్‌స్టాప్ పడే అవకాశం ఉందన్నారు. సలేశ్వరం జాతరలో స్థానిక చెంచులు తామే కొబ్బరికాయలు, ఇతర చిరు వ్యాపారాలు చేసుకుంటామని, తమకు ఆర్థిక సహాయం అందించాలని ఐటీడీఏకు విన్నవించుకోగా ఒక్కొక్కరికి రూ.20 వేలు రుణంగా ఇస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో మన్ననూరు రేంజ్ అధికారి ఈశ్వర్, డీఆర్‌వో రవికుమార్, అటవీ విద్యాధికారి శ్వేత పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులకు జైలుశిక్ష, జరిమానా

- మద్యం తాగి వాహనాన్ని నడిపిన కేసులో ఒకరికి
- ఈవ్ టీజింగ్ చేసిన కేసులో మరొకరికి..

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 16 : మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తితో పాటు, ఈవ్ టీజింగ్ కేసులో మరో వ్యక్తికి మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా సెకండ్ క్లాస్ న్యాయాధికారి రామయ్య ఒకరోజు జైలుశిక్షతో పాటు, జరిమానా విధించారు. ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల చేపట్టిన డ్రైంకెన్ డ్రైవ్‌లో మండలంలోని గగ్గలపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ అనే వ్యక్తి మద్యం తాగి నాగర్‌కర్నూల్ పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతనికి న్యాయాధికారి ఒకరోజు జైలుశిక్షతో పాటు, రూ.2,100 జరిమానా విధించారు. అదేవిధంగా, తూడుకుర్తి గ్రామానికి చెందిన శేఖర్ నాగర్‌కర్నూల్ బస్టాండ్ ప్రాంతంలో అమ్మాయిలతో దురుసుగా ప్రవర్తిస్తుండగా షీటీమ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో శేఖర్‌కు ఒకరోజు జైలు శిక్షతో పాటు, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. ఈ రెండు ఘటనల్లో పోలీస్ సిబ్బందిని, షీటీమ్ సిబ్బందిని ఎస్పీ ప్రశంసించారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


లక్ష్మణ్‌నాయక్ (ఫైల్)

బిజినేపల్లి, ఏప్రిల్ 16 : ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతైన యువకుడి మృతదేహాన్ని మంగళవారం ఉదయం ఎన్డీఆర్ఎఫ్ దళాలు బయటకు తీశాయి. ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇప్పలతండాకు చెందిన లక్ష్మణ్‌నాయక్(18) శనివారం మధ్యాహ్నం తర్వాత ఐదుగురి స్నేహితులతో కలిసి వట్టెంలోని పాలమూరు-రంగారెడ్డి రిజర్వాయర్‌లోని గుంటలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈత కొడుతూ గల్లంతయ్యాడు. మృతదేహం కోసం స్థానిక అగ్నిమాపక సిబ్బంది గాలించినా లభించకపోవడంతో సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ఎన్డీఆర్ఎఫ్ దళాలు వచ్చాయి. నీటి గుంటలో గాలించగా నీటి అడుగులో రాళ్ల మధ్య ఇరుక్కుపోవడంతో శవం నీటిపై తేలకుండా అక్కడే ఉన్నట్లు గుర్తించి బయటకు తీశారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహాన్ని అందజేసినట్లు ఎస్సై వివరించారు. ఘటనపై మృతుడి తండ్రి ఆంజనేయులునాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

రాజోలి, ఏప్రిల్ 16 : ట్రాక్టర్ పైనుంచి కింద పడిన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్దతాండ్రపాడు గ్రామంలో చోటు చేసుకుంది. రాజోలి ఎస్సై జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల మల్లేష్ కుమారుడు భరణి(16) సోమవారం తమ వ్యవసాయ పొలంలో ఎరువు వేసేందుకు బాబాయి గొల్లకృష్ణతో కలిసి ట్రాక్టర్‌పై బయలుదేరాడు. పొలంలో ఎరువు వేసి తిరిగి వస్తుండగా గ్రామంలోని చర్చి ముందు సెల్‌ఫోన్ కింద పడింది. ట్రాలీపై నిలబడిన బాలుడు సెల్‌ఫోన్‌ను అందుకునేందుకు పక్కకు వంగి కింద పడిపోయాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ బాలుడి పైనుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం కర్నూల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

కొత్తకోట, ఏప్రిల్ 16 : మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కూరగాయల తిరుపతయ్య కుమారుడు కృష్ణయ్య(34) రెండు నెలల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి షిరిడీకి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో భార్య, కుమారుడు మృతి చెందారు. నాటినుంచి మనోవేదనతో ఉన్న కృష్ణయ్య ఘటన నుంచి తేరుకోలేదు. భార్య, కుమారుడు లేని జీవితం ఎందుకని వేదన చెందుతూ మంగళవారం రాత్రి ఇంట్లో తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నల్లమల ఘాట్ రోడ్డులో కారు బోల్తా

- నలుగురికి తీవ్ర గాయాలు, హైదరాబాద్‌కు తరలింపు

దోమలపెంట, ఏప్రిల్ 16 : నల్లమల ఘాట్‌రోడ్డు శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై కారు బోల్తా పడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈగలపెంట ఎస్సై వీరమల్లు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ మలక్‌పేటకు చెందిన పరమేశ్వర్‌రావు(60), భార్య అన్నపూర్ణ(55), విశాఖపట్టణానికి చెందిన అల్లుడు రాజ్‌కుమార్(38), కూతురు శాంతి(35), మనమరాలు తబిక్ష(2)తో కలిసి శ్రీశైలం వెళ్లారు. మల్లన్న దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి సమీపంలో రాజ్‌కుమార్ కారును వేగంగా నడపడంతో వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో నలుగురికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించామని ఎస్సై వివరించారు. చిన్నారికి ఎలాంటి గాయాలు కాలేదని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు, వ్యక్తికి తీవ్ర గాయాలు

మాగనూరు : నారాయణపేట జిల్లా మాగనూరు మండల కేంద్ర సమీపంలోని 167వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై ఎండీ.అబ్దుల్‌ఖాదర్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని దేవసూగూరు గ్రామానికి చెందిన శరణప్ప(48) మంగళవారం బైక్‌పై గ్రామం నుంచి మాగనూరు వైపు వస్తుండగా జాతీయ రహదారిపైనున్న అభిషేక్ దాబా వద్ద రాయచూరు వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో శరణప్పకు గాయాలయ్యాయి. శరణప్ప కుమారుడు రవికి ఫోన్ ద్వారా విషయం తెలుపగా కారును అజాగ్రత్తగా నడిపిన డ్రైవర్‌పై చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె, ఇస్త్రీ డబ్బా దగ్ధం

- నాగర్‌కర్నూల్ జిల్లాలో వేర్వేరు చోట్ల ఘటనలు
- సిద్దాపూర్‌లో కూతురి పెళ్లి కోసం తెచ్చిన డబ్బు, బంగారం అగ్గిపాలు
- నిరాశ్రయులైన బాధిత కుటుంబం


సిద్దాపూర్‌లో కాలిపోయిన పూరిగుడిసె ముందు బాధిత కుటుంబం

అచ్చంపేట టౌన్/కల్వకుర్తి, ఏప్రిల్ 16 : షార్ట్ సర్క్యూట్ ఏర్పడి నాగర్‌కర్నూల్ జిల్లాలోని వేర్వేరు చోట్ల పూరిగుడిసెతో పాటు, ఇస్త్రీ డబ్బా దగ్ధమైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. జిల్లాలోని అచ్చంపేట మండలం సిద్దాపూర్ గ్రామంలో పూరిగుడిసెలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగగా, కల్వకుర్తి పట్టణంలోనూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఇస్త్రీ డబ్బా దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే..


కల్వకుర్తిలో షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన ఇస్త్రీ డబ్బాలోని దుస్తులు

నాగర్‌కర్నూల్ జిల్లా సిద్దాపూర్ గ్రామానికి చెందిన రెడ్డెమోని వెంకటయ్య మంగళవారం తాను ఉంటున్న పూరి గుడిసెకు తాళం వేసి ఉదయం భార్య గోపమ్మ, కుమార్తెతో కలిసి ఉపాధి హామీ పనులకు వెళ్లారు. ఈ క్రమంలో పూరిగుడిసెలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. గమనించిన చుట్టుపక్కల వారు నీళ్లు పోసి మంటలను ఆర్పారు. అప్పటికే గుడిసెలో ఉన్న రూ.లక్షకు పైగా నగదు, మూడు తులాల బంగారం, బియ్యంతో పాటు, దుస్తులు, వ్యవసాయ సామగ్రి కాలి బూడిదైంది. కూతురి పెళ్లి కోసం పైసాపైసా కూడబెట్టిన డబ్బుతో పాటు, కొని దాచుకున్న బంగారం సైతం మంటల్లో కాలి బూడిదై పోవడంతో బాధిత కుటుంబం భోరున విలపించింది. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ గ్రామస్థులు తహసీల్దార్, విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

కల్వకుర్తిలో...

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇస్త్రీ డబ్బా దగ్ధమై బట్టలు కాలిపోయాయి. పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ఎం.శ్రీనివాస్ ఇస్త్రీ డబ్బా పెట్టుకొని దుస్తులు ఇస్త్రీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం డబ్బాను మూసి భోజనానికి ఇంటికెళ్లాడు. ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ జరిగి డబ్బాలోని దుస్తులు, ఇస్త్రీ పెట్టెలు కాలి బూడిదయ్యాయి. షాపులో నుంచి వస్తున్న పొగలను గుర్తించిన స్థానికులు సమాచారమివ్వడంతో వచ్చి చూసేసరికి దుస్తులన్నీ కాలి బూడిదయ్యాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

జమ్ము మొక్కలకు చెలరేగిన మంటలు

- తగలబడిన వ్యవసాయ నీటి పరికరాలు

అయిజ, ఏప్రిల్ 16 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం సంకాపూర్ గ్రామంలో పంటకు నీటి పంపిణీ చేసేందుకు ఉన్న విద్యుత్ పరికరాలు, పైపులు మంటల్లో కాలిపోయాయి. మంగళవారం మధ్యాహ్నం ఉన్నట్టుండి మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. సంకాపూర్ గ్రామ సమీపంలో గల చెక్‌డ్యాంలో లోతైన గొయ్యిని బావిలా తవ్వి రైతులు విద్యుత్ మోటార్లు అమర్చుకున్నారు. వాటి ద్వారా పొలాలకు నీటిని పంపిణీ చేసుకొని పంటలు పండించుకుంటున్నారు. నీటి పరిసరాల్లో జమ్ము పెరిగి వట్టిపోయింది. మంగళవారం మధ్యాహ్నం ఉన్నట్టుండి జమ్ము మొక్కలకు మంటలు చెలరేగి అక్కడే రైతులకు చెందిన విద్యుత్ స్టార్టర్లు, తీగలు, పైపులు మంటల్లో తగులబడిపోయాయి. రైతులు గోపాల్, వెంకట్రాములు, సూర్యనారాయణ, సత్యనారాయణ, ఈరన్న, నర్సింహులు, తిమ్మప్పతో పాటు, దాదాపు 40 మంది రైతులకు చెందిన నీటిని తోడ వేసే యంత్ర పరికరాలు మంటల్లో కాలిపోయాయి. రైతులు గమనించి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికి ఫలితం లేకుండా పోయింది. రూ.మూడు లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధిత రైతులు తెలిపారు.


నీటితో మంటలను ఆర్పుతున్న రైతు

యువతి అదృశ్యం కేసు నమోదు

మిడ్జిల్, ఏప్రిల్ 16 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి(17) అదృశ్యమైంది. ఎస్సై చంద్రమోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 15న కుట్టుమిషన్ నేర్చుకునేందుకని పక్క గ్రామానికి వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమెకోసం కుటుంబీకులు వెతికారు. మంగళవారం యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నట్లు ఎస్సై తెలిపారు. కాగా, బంధువైన ఓ యువకుడిపై అనుమానం ఉన్నట్లు యువతి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై చెప్పారు.

నల్లవెల్లిలో యువకుడు..

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 16 : నాగర్‌కర్నూల్ జిల్లా నల్లవెల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్సై గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బతిక రాజేష్(28) కొంతకాలంగా హైదరాబాద్‌లో మేస్త్రీ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గతేడాది ఓ యువతితో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో అతన్ని తీసుకొచ్చి కౌన్సెలింగ్ నిర్వహించి గ్రామంలోనే ఉంచారు. సోమవారం ఇంటి నుంచి బైక్ తీసుకుని వెళ్లిన రాజేష్ తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం వెతికారు. రాజేష్ జాడ కానరాకపోవడంతో భార్య లక్ష్మీ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. రాజేష్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలి : కలెక్టర్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఏప్రిల్ 16 : ఓటింగ్ శాతం పెంచేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి. రవినాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో స్వీప్ కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భం కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లలో చైతన్య తీసుకురావాలన్నారు. అందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం పలు కార్యక్రమాలు రూపొందించిందని వివరించారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కును పొందాలని, ఆ హక్కును సద్వినియోగం చేసుకోనేందుకు కృషి చేయాలని సూచించారు. ఓటింగ్ శాతం పెంచేందుకు జిల్లా పరిషత్, తదితర స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఈజీఎస్, సెర్ప్ సిబ్బందికి తరచూ ఓటింగ్ ప్రాధాన్యత తెలియజేస్తూ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. మునిసిపాలిటీలలో వార్డు మీటింగ్‌లు, కళాజాత బృందాలతో పాటలతో ఎన్నికల పట్ల ఆసక్తిని పెంపొందించాలని అన్నారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల కోసం కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రచార నిమిత్తం స్థానిక సంస్థలు, మునిసిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో పలు స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. బ్యానర్లు, సెల్ఫీ పాయింట్లు తదితర ప్రచార సామగ్రితో యువ ఓటర్లను ఆకర్షితులు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయక రిటర్నింగ్ అధికారులు వీన్, మోహన్‌రావు, జడ్పీ సీఈఓ రాఘవేంద్రరావు, డీపీఆర్వో శ్రీనివాస్, డీఈవో రవీందర్, మునిసిపల్ కమిషనర్లు, యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఉమ, కలెక్టర్ సిబ్బంది మాట్లాడారు.

ప్రమాద సమయంలో అధైర్యపడొద్దు

- అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి అధికారి శ్రీకాంత్‌రెడ్డి



సిలిండర్ నుంచి వ్యాపించిన మంటలను ఎలా ఆర్పాలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది

జడ్చర్ల (మిడ్జిల్), ఏప్రిల్ 16 : సిలిండర్ నుంచి మంటలు వ్యాపించినప్పుడు, ఎలక్ట్రిక్ ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు భయాందోళనకు గురికాకుండా ఉండి, నివారణకు చర్యలు చేపట్టాలని అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జడ్చర్ల పట్టణంలోని పద్మావతి కాలనీలో అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా కాలనీ వాసులకు, అపార్ట్మెంట్‌లలో నివాసించే వారికి సిలిండర్, ఎలక్ట్రిక్ వైర్లకు మంటలు వ్యాపించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితిరెడ్డి, రిటైర్డ్ ఫైర్ అధికారి చెన్నయ్య, సిబ్బంది వెంకటయ్య, నవీన్‌కుమార్, శ్రీనివాస్, గౌస్‌పాషా ఉన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రమాశ్రీకాంత్

దేవరకద్ర, ఏప్రిల్ 16 : మండలంలోని ప్రతీ గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ రమాశ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు ప్రత్యేక అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా వారు మాట్లాడారు. ప్రస్తుతం ఎండకాలంలో గ్రామాల్లో ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వాటర్ ట్యాంక్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. సర్పంచ్‌ల పదవి ముగించడంతో ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన నడుస్తోందని, ఎంపీటీసీ సభ్యులు కూడా గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. నాటిన ప్రతీ మొక్కకు నీరు అందించి వాటిని సంరక్షించాలని అన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీల సంఖ్య పెంచాలన్నారు. విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ మీ గ్రామాల్లో బడి ఈడు పిల్లలు బడి బయట ఉంటే అలాంటి వారిని పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఆయా శాఖల అధికారులు సభలో శాఖాపరంగా చేపట్టిన పనుల వివరాలను చదివి వినిపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగాంగా ఎలాంటి తీర్మానాలు చేయలేదు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎల్లయ్య, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

వేసవి నుంచి ఉపశమనం కోసమే అంబలి కేంద్రం

పాలమూరు, ఏప్రిల్ 16 : ప్రతీ రోజు ప్రభుత్వాసుపత్రికి వచ్చే అనేక మంది ప్రజలు, రోగులు, సహాయకులు, ఇతరులకు వేసవి నుంచి ఉపశమనం లభించాలనే అంబలి కేంద్రం ఏర్పాటు చేసినట్లు వాసవి, వనితక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివా సులు, ఏ.సువర్ణ, కె.ఉమా దేవి, ఎ.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పెద్దాసుపత్రి దగ్గర చలివేంద్రంతోపాటు ప్రతీరోజు ప్రజలకు అంబలి అందజేయాలనే ఉద్దేశంతో వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. కొండ పారిజాతమ్మ జ్ఞాపకార్థంగా కొండ శ్రీవిద్య, ఆంజనేయులు అంబలి కేంద్రానికి అయ్యేఖర్చు భరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇలాంటి సేవాకార్యక్రమాలు చేయడానికి అందరూ ముందుకు రావాలని కోరారు.

మోదీని గద్దె దించితేనే హక్కులకు రక్షణ

- కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని సీపీఎం నాయకుల పిలుపు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు టి.సాగర్

పాలమూరు, ఏప్రిల్ 16 : ప్రజాస్వామిక హక్కులపై ఉక్కుపాదం మోపిన మోదీ ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.సాగర్ ప్రజలకు పిలుపునిచ్చారు. మూడోసారి బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకుందామని అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భువనగిరిలో సీపీఎం అభ్యర్థి బరిలో ఉన్నారని, మిగిలిన స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామిక హక్కులపై ఉక్కుపాదం మోదీ ప్రభుత్వం మోపుతోందని, ప్రశ్నించే గొంతుకలను నొక్కుతున్న కాషాయ దళం ఆటలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మనువాద శాస్త్రాన్ని అమలు చేసేందుకు అడ్డుగా ఉన్న రాజ్యాంగాన్ని మార్చేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ ఎందుకు ఇవ్వడంలేదని ఆయన ప్రశ్నించారు. నూతన చట్టాలు తెచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతున్నారని తెలిపారు. కేంద్రం విధానాలతో ముస్లింలు, మైనారిటీలు, దళితులు, మహిళలు బీజేపీకి ప్రథమ శత్రువుగా మారిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు, కిల్లె గోపాల్, చంద్రకాంత్, కురుమయ్య, వి.పద్మ, జగన్, నరసింహ పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

నవాబ్‌పేట, ఏప్రిల్ 16 : అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కాకర్లపాడ్ వద్ద జిల్లా కేంద్రం వైపు ఇసుక లోడ్‌తో వెళ్తున్న ఓ టిప్పర్‌ను గస్తీ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది పట్టుకుని విచారించగా జూలపల్లి సత్యనారాయణకు చెందిన తేలింది. స్టేషన్‌కు తరలించి విచారించగా అనుమతి లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుకను తరలిస్తున్న వ్యక్తిపై కేసు

గండీడ్ : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన మండల పరిధిలోని రంగారెడ్డి పల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎరుకలి రవి మంగళవారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

గురజాలటౌన్, ఏప్రిల్ 16 : పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను పల్నాడు జిల్లా గురజాల పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్లో సీఐ బాలకృష్ణ విలేకరులకు వివరాలను వెల్లడించారు. గత నెలలో బూడిద శ్రీనివాసరావు ఇంట్లో లేని సమయంలో రూ. 5 లక్షల విలువైన 64 గ్రాముల బంగారు చోరీ అయినట్లు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం పులిపాడు వద్ద ముగ్గురు అనుమానితులను అరెస్ట్ చేసి విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. కారంపూడి మండలం మిర్యాలకు చెందిన షేక్ బాబావలి, తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలానికి చెందిన సరికొండ మహేష్, వడ్డె పవన్ పల్నాడు జిల్లాలోని దాచేపల్లిలో 3, మాచర్లలో 1, గురజాలలో 1, తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూల్ జిల్లాలో ఒక చోరీకి పాల్పడినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 156 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి

- శ్రీరామ నవమికి విస్తృత ఏర్పాట్లు



మహబూబ్‌నగర్ పట్టణం టీచర్స్‌కాలనీలో ముస్తాబైన ఆలయం

మహబూబ్‌నగర్ టౌన్/ మిడ్జిల్/ గండీడ్/ భూత్పూర్, ఏప్రిల్ 16 : శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని పలు దేవాలయాలలో విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా టీచర్స్‌కాలనీ రామాలయం, రామమందిర్ చౌరస్తాలోని రామాలయం భగీరథ కాలనీలోని రామాలయం, పాన్‌చౌరస్తా సమీపంలోని రవీంద్రనగర్, శ్రీనివాస కాలనీలోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో, శివశక్తి నగర్‌లోని శివాలయంలో శ్రీ సీతారాములు కళ్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. భక్తులకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యాపారులు పట్టణంలోని ప్రధాన రోడ్లపై రాముల వారి విగ్రహాలను విక్రయించారు. టీచర్స్ కాలనీలోని శ్రీరామాలయంలో వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు పూజారి ప్రవీణ్ పేర్కొన్నారు. మిడ్జిల్ మండలంలోని వెలుగొమ్ముల, మిడ్జిల్, రెడ్డిగూడ, అయ్యవారిపల్లి, వస్పుల, దోనూరు గ్రామాలతో పాటు పలు గ్రామాలలోని శ్రీరామ నవమి వేడుకలకు ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మిడ్జిల్‌లో సీతారామాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి సీతారామలక్ష్మణ, హనుమంతుని విగ్రహాలను గ్రామంలోని ఊరేగించారు. ఆలయ చైర్మన్ శంకర్, అర్చకుడు శ్రీనువాస్, వివేక్, సంతోష్, కమిటీ సభ్యులు శ్రీనివాసులు, శేఖర్, పలు పార్టీల నాయకులు అల్వాల్‌రెడ్డి, రాజేశ్వర్, వెంకట్‌రెడ్డి, తిరుపతి, భాస్కర్, అశోక్, పర్వతాలు, రాముగౌడ్ ఉన్నారు. గండీడ్ మండల పరిధిలోని వెన్నాచేడ్, బండమీది రామస్వామి దేవాలయంలో జంగంరెడ్డి పల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో కూడా సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సీతారాముల కల్యాణానికి ముస్తాబైన దేవాలయాలు భూత్పూర్ మండలంలోని పోతులమడుగు గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవాలయం, మండల కేంద్రంలో ఉన్న సంజీవరాయుని దేవాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. దేవాలయాల్లో ద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి

- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి

- జీపీపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 16 : క్రీడల్లో జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మహబూబ్ నగర్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. బోయపల్లి సమీపంలో ఎండీసీఏ మైదానంలో గోర్‌బంజారా ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ పేరిట ప్రతీ ఏడాది బంజరా ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందిం చారు. మొత్తం టోర్నీలో 14 జట్లు పాల్గొన్నాయి. ఈ నెల 19 వరకు టోర్నీ జరు గుతుందని నిర్వాహకులు తెలిపారు. విజేత జట్టు రూ.1,00155, రన్నర్ జట్టుకు రూ.50,1155 నగదుతో పాటు ట్రోఫీ అందజేస్తారు. మొదటి రోజు మ్యాచ్‌లో రాథోడ్ రాకర్స్ సేవాలాల్ జట్టు గెలిచింది. కార్యక్రమంలో జీపీపీఎల్ కమిటీ చైర్మన్ రమావత్ రవిరాథోడ్, కమిటీ సభ్యులు కృష్ణనాయక్, పూన్యానాయక్, మోహన్ నాయక్, నాయకులు శేఖర్ నాయక్, లక్ష్మణ్‌నాయక్, ప్రతాప్‌నాయక్, కిషన్‌పవార్, గోవర్ధన్ నాయక్, రమేష్ నాయక్, రామునాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

హన్వాడ : పాలమూరు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషిచేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రం లోని కింగ్ గార్డెన్‌లో హన్వాడ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ భారతదేశంలో బీజేపీ పని అయిపో యిందన్నారు. కనీసం బీజేపీకి 180సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు. మండలంలోని మునిమోక్షం, టంకర, హన్వాడ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీటీసీలు, నాయకులు మంగళవారం వంశీచంద్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మైనారిటీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, బీసీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, రాష్ట్ర నాయకులు ఎన్‌పీ వెంకటేష్, సంజీవ్ ముదిరాజ్, మిథున్‌రెడ్డి, ఎం.సురేందర్‌రెడ్డి, నాయకులు మహేందర్, కృష్ణయ్య, వెంకటయ్య, యాదిరెడ్డి, లింగం నాయక్, రఘుపతిరెడ్డి, సత్యం, సురేందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు మహేందర్, జిల్లా కార్యదర్శి కృష్ణయ్య, మండల కో-ఆర్డినేటర్ వెంకటయ్య పాల్గొన్నారు.

రేపు డీకే అరుణ నామినేషన్



మాట్లాడుతున్న బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండ గణేష్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఏప్రిల్ 16 : ఈ నెల 18న భారతీయ జనతా పార్టీ పాలమూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా డీఏ అరుణ తన నామినేషన్‌ను దాకలు చేస్తారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేవైఎం ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం జరిగింది. అంతకు ముందు బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండా గణేష్ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గెలుపునకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణవర్ధన్ రెడ్డి, అంజయ్య, పడాకుల సత్యం, పద్మవేణి, పోతుల రాజేందర్‌రెడ్డి, కొత్తకోట కిరణ్‌కుమార్ రెడ్డి, రాములు యాదవ్, అశోక్, సుధీర్, అరవింద్ పాల్గొన్నారు.

'వంశీచంద్‌రెడ్డి... నోరు అదుపులో పెట్టుకో'

మహబూబ్‌నగర్ (క్లాక్ టవర్) : ఓటమి భయంతో కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణపై నోటికొచ్చినట్లు మాట్లాడటం సభ్యత అనిపించుకోదని పాలమూరు మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు కుర్వ రాములు అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీకే అరుణను దొరసాని అనడం సిగ్గుగా అని పించడంలేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వికారాబాద్-పరిగి-కొడంగల్-కృష్ణ రైల్వేలైన్‌కు కృషి చేశానని గొప్పలు చెప్పారని, అసలు దానిపట్ల అవగాహన ఉండే చెపుతున్నావా అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఓడిపోతుందన్న భయంతో మేకపోతు గాంబీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. మా అభ్యర్థి పట్ల అనుచిత వ్యాఖ్యాలు చేస్తే ప్రజలే గుణపాఠం చెపుతారని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు నిరంజనమ్మ, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్.రమేశ్, కార్యదర్శులు పద్మవేణి, సీనియర్ నాయకులు పాండురంగారెడ్డి, బుచ్చిరెడ్డి, అంజయ్య, పోతుల రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

దేవరకద్రలో ఇంటింటి ప్రచారం

దేవరకద్ర : కేంద్రంలో మళ్లీ నరేంద్రమోదీ గెలుపు ఖాయమని బీజేపీ మండల అధ్యక్షుడు కృష్ణంరాజు, దేవయ్య అన్నారు. మంగళవారం దేవరకద్ర పట్టణంలోని కార్యకర్తలు, యువకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఇప్పటి వరకు నరేంద్రమోదీ నిరుపేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అందించారన్నారు. బీజేపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేశారు. బీజేపీ మండల నాయకులు సత్తి, నాగిరెడ్డి అంజి, సాయిరాజ్, రాజు, ఆంజనేయులు, వెంకటేష్ పాల్గొన్నారు.

రుణమాఫీ ఏమైంది : బాలవర్ధన్ గౌడ్

నవాబ్‌పేట : ఓట్లను దండుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ పేరుతో కొత్త నాటకానికి తెరలేపారని బీజేపి జిల్లా అధికార ప్రతినిధి ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడితో కలిసి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ప్రజలు నమ్మకపోవడంతో ఇతర పార్టీల వైపు చూస్తారన్న అనుమానంతో నారాయణపేట బహిరంగ సభలో ఆగస్టులోపు రుణమాఫీ అని చెప్పడం ముమ్మాటికీ మోసపూరితమేనని అన్నారు. ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చడం వల్ల కులాల మధ్య కొట్లాటలు పెట్టేందుకు రేవంత్‌రెడ్డి సిద్ధమయ్యారని, ఈ నిర్ణయం వల్ల అందులో ఉన్న 25 పైగా ఉప కులాలు కొట్టుకునే అవకాశం ఉందన్నారు. ఈనెల 18 జిల్లా కేంద్రంలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలి రావాలని కోరారు. నాయకులు యాదయ్య, శ్రీనివాసులు, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

తక్కువ బరువు శిశువులకు మెరుగైన వైద్యం

- సుశ్రుత ఆసుపత్రిలోని నియోనేటల్ ఐసీయూ ద్వారా వైద్యసేవలు



కోలుకున్న శిశువును చూపిస్తున్న సుశ్రుత వైద్యులు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), ఏప్రిల్ 16 : తక్కువ బరువున్న శిశువులకు నియోనేటల్ ఐసీయూ ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు సుశ్రుత ప్రజా వైద్యశాల ఎండీ డాక్టర్ ప్రతిభ తెలిపారు. సుశ్రుత ఆసుపత్రిలోని నియోనేటల్ ఐసీయూ సెంటర్ ద్వారా అందిస్తున్న వైద్యసేవలపై మంగళవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమెతో పాటు ప్రముఖ నియోనేటలజిస్టు వైద్యురాలు డాక్టర్ ప్రియాంక మాట్లాడారు. గర్భందాల్చిన నాటి నుంచి కాన్పు అయ్యే వరకు ఆ తల్లుల అనారోగ్య సమస్యల కారణంగా తక్కువ బరువుతో పిల్లలు పుడుతున్నారని, అయితే వారికి సరైన వైద్యసేవలు పాలమూరులో అందుబాటులో ఉన్నప్పటికీ అవగాహన లేకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉందన్నారు. దాన్ని దృష్టిలో ఉంచుకొని గతేడాది ఆసుపత్రిలో నియోనేటల్ ఐసీయూ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రారంభించిన ఏడాదిలోనే 356 మంది తక్కువ బరువు ఉన్న శిశువులకు వైద్య సేవలు అందించామని వివరించారు. చాలామంది నిరుపేదలే కావడంతో ఆరోగ్యశ్రీ ద్వారానే ఉచితంగా ఈ సేవలను అందించామని అన్నారు. మిడ్జిల్ మండలం వల్లభురావుపల్లి గ్రామానికి చెందిన పూజ, మహేష్ దంపతులకు 28 వారాలు 7 నెలలు నిండిన శిశువు కేవలం 790 గ్రాముల బరువుతో పుట్టారని, ఊపిరి తీసుకోవడం కష్టంగా, కనీసం పాలు కూడా తాగలేని స్థితిలో తమ ఆసుపత్రికి వచ్చారన్నారు. వారికి నియోనేటల్ ఐసీయూ కేంద్రంలో జాయిన్ చేసుకొని 75 రోజుల పాటు నిర్విరామంగా ఆధునిక వైద్యసేవలు అందించామని, ప్రస్తుతం ఆ శిశువు బరువు 1.5 కేజీలు పెరిగిందన్నారు. వారికి పైసా ఖర్చు రాకుండా వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. తక్కువ బరువుతో పుట్టిన పిల్లలకు అత్యాధునిక వైద్యం మహబూబ్‌నగర్‌లోనే అందుబాటులో ఉన్నదని, వాటికి ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యానికి శిశువు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

అనుమతులతోనే పనులు ప్రారంభం

- కలెక్టర్ జి. రవి నాయక్

- అమర్ రాజా బ్యాటరీ కంపెనీపై ఫిర్యాదులకు స్పందన

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఏప్రిల్ 16 : అమర్ రాజా బ్యాటరీ కంపెనీ పనులను ఆపి వేయాలంటూ మంగళవారం పలు గ్రామాల ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆ ఫిర్యాదులకు కలెక్టర్ జి. రవినాయక్ స్పందించి మాట్లాడారు. కంపెనీకి అన్ని అనుమతులు ఉండడం వల్ల పనులు ప్రారంభించారని అన్నారు. ఇది వరకే కంపెనీ దగ్గర ప్రజాభిప్రాయం కూడా సేకరించారని, దానికి అనుగుణంగా కంపెనీకి అనుమతులు ఉన్నట్లు తెలిపారు. మీకు ఆ కంపెనీపై ఎలాంటి సమస్యలు, ఆక్షేపణలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే వాటిని ఉన్నతాధికారులకు పంపించి వివరణను మీకు తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో నవీన్, అదనపు కలెక్టర్లు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు ఉన్నారు.

ఆర్జిత సెలవులు మంజూరు చేయాలి

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 16 : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ఈ వేసవి సెలవులు ముగిసేలోగా అన్ని వసతుల కల్పన కోసం నిత్యం హెచ్ఎంల పర్యవేక్షణలో పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమని ఆల్‌మేవా అధ్యక్షుడు షేక్ ఫారుక్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. కానీ నిబంధనల ప్రకారంగా హెచ్‌లకు నెల రోజుల ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తీరిన నీటి కష్టాలు

గండీడ్, ఏప్రిల్ 16 : మండల పరిధిలోని చిన్నవార్వల్ గ్రామంలో ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి తన ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయగా బోరు వేయించారు. ప్రజలు నీటి సమస్య ఉండడంతో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఎస్‌డీఎఫ్ రూ.రెండు లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో మంగళవారం గ్రామంలో బోరు వేయించి మోటార్ బిగించారు. గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయులు, ఎక్బాల్, వెంకటయ్య, శ్రీను, వెంకటేష్, రాము నాయక్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'బేషరతుగా శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వాలి'

పాలమూరు, ఏప్రిల్ 16 : బీసీలను అవమానిస్తున్న పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీసీ సమాజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణపేట సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ అధికంగా పార్లమెంట్ సీట్లు గెలిస్తే ముదిరాజ్ బిడ్డను మంత్రిని చేస్తానని చెప్పటం సరికాదన్నారు. బేషరతుగా బీసీ బిడ్డ వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. సమావేశంలో జాంగ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్, గోపాల్, రమేష్, సత్యం, సత్యం, బి.శేఖర్ పాల్గొన్నారు.

పెన్షనర్లు ఏకంకావాలి

- టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 17 : పెన్షనర్లు అందరూ ఏకంకావాలని టీపీసీసీ అధికార ప్రతినిధి జి.హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీజేఏసీ మాజీ చైర్మన్ జి.రాజేందర్‌రెడ్డి, టీపీఆర్‌టీయూ మాజీ జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పెన్షనర్లపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం చెప్పామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ఏకమై పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచిన అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈనెల 18న పెన్షనర్లు, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమావేశాన్ని పట్టణంలోని అన్నపూర్ణ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లావంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డిలు హాజరు కానున్నారని తెలిపారు. పెన్షనర్లు అధికసంఖ్యలో పాల్గొని కోరారు.

మహనీయుల త్యాగఫలితమే నేడు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం

- పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్

పాలమూరు యూనివర్సిటీ ఏప్రిల్ 16 : మహనీయుల త్యాగ ఫలితమే నేడు స్వేచ్ఛా, స్వాతంత్ర్యమని పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. మంగళవారం పాలమురు యూనివర్సిటీ లైబ్రరి ఆడిటోరియంలో నిర్వహించిన మహనీయుల జయంతి ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరై డాక్టర్ బెల్లయ్య నాయక్, ప్రొఫెసర్ జి.నాగరజు, ప్రొఫెసర్ శ్రీనువాసులు, అధికారులతో కలిసి మహనీయుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. వీసీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కంటే ముందు పూలే-అంబేడ్కర్ ఎన్నో అసమానతలు చవి చూశారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం బాబూజగ్జీవన్ రామ్ అధికారంలో ఉన్నప్పటికీ అసమానతలకు, అవమానకు గురయ్యారని అన్నారు. అంతకుముందు ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీనివాసులు మాట్లాడుతూ భారతదేశంలో ఆర్థిక అసమానతలకు కుల వ్యవస్థ కారణమని అన్నారు. బెల్లయ్యనాయక్ మాట్లాడుతూ అంబేడ్కర్ ప్రపంచ మేధావి అని, గొప్ప సంఘ సంస్కర్త అని అన్నారు. ఆయన బాల్యంలోనే ఎన్నో అవమానాలు ఎదుర్కొని అచంచల ఆత్మ విశ్వాసంతో చదువుకొని భారత రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. ఈరోజు భారతదేశం ఆకలి లేకుండా ప్రశాంతంగా ఉండటానికి కారణం బాబూ జగ్జీవన్‌రామ్ అని హెచ్‌సీయూ ప్రొఫెసర్ నాగరాజు అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ రాజ్‌కుమార్, పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, ఎంఈడీ ప్రిన్సిపాల్ డాక్టర్ బషీర్ అహ్మద్, పీయూ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కృష్ణయ్య, ఎస్ఎస్‌టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి, పీయూ పీఆర్ఓ డాక్టర్ శేకుంటి రవికుమార్, పీయూ అధికారులు, సిబ్బంది, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మారిన కంకర టిప్పర్లపై చర్యలు తీసుకోవాలి



ఓవర్ లోడ్‌తో వెళ్తున్న కంకర టిప్పర్లు

బాలానగర్, ఏప్రిల్ 16 : మండలంలోని గౌతాపూర్, ఉమ్మడి బొడజానంపేట గ్రామాలలో ఆరుకుపైగా కంకర పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఈ కంకర పరిశ్రమలకు ప్రతీ రోజు 100కు పైగా టిప్పర్లు ఓవర్ లోడ్‌తో రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో బాలానగర్ మండల కేంద్రంలో నుంచి పెద్దరేవల్లి గ్రామం వరకు బీటీరోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు గుండా వెళుతున్న ప్రతీ కంకర టిప్పరు పరిమితికి మించి (40 నుంచి 50 టన్నుల వరకు) కంకరను నింపుకొని హైదరాబాద్, శంషాబాద్, షాద్‌నగర్, కొత్తూరు, జడ్చర్ల, బాలానగర్ మండలంలోని వివిధ పరిశ్రమలకు, వెంచర్లకు తరలిస్తున్నారు. టిప్పర్లు ఓవర్‌లోడ్‌తో వెళ్తుండడంతో రహదారులు గుంతలమయంగా మారాయి. ఈ టిప్పర్లు అతివేగంగా ప్రయాణిస్తూ అతిజాగ్రత్తతో డ్రైవింగ్ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుపై ప్రయాణిస్తున్న ఆటో, వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నామని వాపోతున్నారు. ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఓవర్‌లోడ్‌తో ప్రయాణిస్తున్న కంకర టిప్పర్లను సంబంధిత అధికారులు అదుపు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

మద్దతు ధరకంటే తక్కువకు కొంటే చర్యలు

డీఏవో బి.వెంకటేశ్



అడ్డాకుల రైతువేదికలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేశ్

అడ్డాకుల, ఏప్రిల్ 16 : ప్రభుత్వం వరికి నిర్ణయించిన కనీస మద్దతు ధరకు తక్కువగా వ్యాపారులు, దళారులు కొంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఏవో బి.వెంకటేశ్ హెచ్చరించారు. మంగళవారం అడ్డాకుల రైతువేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ రాజేందర్‌నగర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు సేంద్రియ వ్యవసాయంపైన రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కలిగించిన తర్వాత నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు కనీస మద్దతు ధర రూ.2203కు అమ్ముకోవాలని, రైతులు తప్పనిసరిగా 17శాతం కన్న తక్కువ తేమ, ఖచ్చితంగా తూర్పార బట్టి 1శాతం తాలు మించకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. ఫేర్ యావరేజ్ క్వాలిటీ (ఎఫ్ఏక్యూ) కనీస ధాన్యం నాణ్యతా ప్రమాణాలను రైతులు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ యశ్వంత్‌రావ్, అడ్డాకుల ఎంఏఓ శ్రీనివాసులు, మూసాపేట ఎంఏవో రాజేందర్‌రెడ్డి, దేవరకద్ర ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.